


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 274 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 7 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :274 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 7 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం

## క్యాడర్ కు చంద్రబాబు క్లారిటీ

- పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ
- తప్పులు చేసేవారిని వదిలించుకుంటానని హెచ్చరిక
- డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టామన్న ముఖ్యమంత్రి
- లోకేష్ పట్టుదలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచన



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణిక మని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటానని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం, సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం. అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మన దరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం చేశారు.గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి

- మిగతా 2లో



# స్పేర్‌సిటీ.. భవిష్యత్ టెక్నాలజీకి వారధి

- మాస్కోలో వ్యాధి నిర్ధారణ చేసే ఏటీఎం... నారా లోకేష్ ఆశ్చర్యం
- మాస్కోలోని స్బేర్ సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేష్
- వ్యాధి నిర్ధారణ చేసే స్బేర్ బ్యాంక్ ఏటీఎంను పరిశీలన
- ఏఐ, క్వాంటం టెక్నాలజీపై ప్రజెంటేషన్ ఇచ్చిన ప్రతినిధులు
- డిజిటల్ హెల్త్‌కేర్, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్‌పై ఆరా

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రష్యా రాజధాని మాస్కోలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్కడి ప్రతిష్టాత్మక స్బేర్ సిటీని సందర్శించి, ఆధునిక సాంకేతికతను పరిశీలించారు. టెక్నాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక

- మిగతా 2లో



# అసలు నువ్వెవరు?

## ప్రకాశ్ రాజ్‌పై జనసేన నేత తీవ్ర ఆగ్రహం

- షూటింగ్‌లకు ప్రకాశ్ రాజ్ ఎప్పుడైనా సమయానికి వచ్చారా అని నిలదీత
- దేశానికి, తెలంగాణకు ఆయన చేసిన సేవ ఏంటని ఎద్దేవా
- గద్దర్ విషయంలో పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు లేదని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:నటుడు ప్రకాశ్ రాజ్‌పై తెలంగాణ జనసేన నాయకుడు సాగర్ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. జనసేన పార్టీ, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే హక్కు ప్రకా శ్ రాజ్‌కు

- మిగతా 2లో

# కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్



- కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులు, రైతుల మోసపోయారన్న కన్నబాబు
- హామీలు నెరవేర్చామని కూటమి నేతలు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా అని సవాల్
- గత ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతూ ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని మండిపాటు

- మిగతా 2లో



# గుడివాడ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- రూ. 4.77 కోట్ల అభివృద్ధి పనులకు వెనిగండ్ల రాము శంకుస్థాపన
- ప్రజలకు సురక్షితమై త్రాగునీరు అందించడమే తమ ధ్యేయమని వ్యాఖ్య
- గతంలో నిర్లక్ష్యానికి గురైన పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడి

- మిగతా 2లో



# రుతుపవనాలు వచ్చేశాయి..

- ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు
- రాయలసీమ ప్రాంతాన్ని తొలుత తాకినట్లు ప్రకటించిన విపత్తుల నిర్వహణ సంస్థ
- ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం
- తరచూ విరామాలు తీసుకుంటూ రుతుపవనాల గమనం సాగే సూచనలు
- కొన్ని జిల్లాల్లో వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలకు అవకాశం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. శనివారం రాయలసీమ ప్రాంతాన్ని రుతుపవనాలు తాకినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అధికారికంగా ప్రకటించింది. ఐఎండి అంచనాల ప్రకారం, త్వరలోనే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకూ విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రుతుపవనాల రాక కాస్త ఆలస్యమైంది. గత సంవత్సరం

- మిగతా 2లో

# బొద్దింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం

## జంతర్ మంతర్‌లో అభిజిత్ దీప్కే

- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ తొలి నిరసన
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఫలితాల అవకతవకలపై ఆందోళన




దేశవ్యాప్త విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై యువత గళమెత్తింది. సోషల్ మీడియా వేదికగా సంచలనం సృష్టించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) శనివారం ఢిల్లీలోని

- మిగతా 2లో




# బెదిరింపులు వద్దు.. ప్రశ్నించడం మా హక్కు

పెన్ పవర్ డెస్క్:సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుగ్గా ఉంటారు ప్రకాశ్ రాజ్ . సామాజిక, రాజకీయ అంశాలపై తన అభిప్రాయా లను నిర్మొహమాటంగా వెల్లడిస్తుంటారు. తాజాగా జనసేన పార్టీ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# టీడీపీకి అతి పెద్ద శాపం అదే... నమ్మిన వాళ్లే ముంచేస్తున్నారు

తెలుగుదేశం పార్టీకి తొలి నుంచి ఒక సెంటిమెంట్ ఉంది. రాజ్యసభ స్థానాలకు ఎవరిని ఎంపిక చేసినా వారు మాత్రం పార్టీకి నమ్మకంగా ఉండటంలేదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి రాజ్యసభ సభ్యుల విషయంలో ఇదే జరుగుతుంది. ఎంపిక చేసి పెద్దల సభకు పంపడం, తర్వాత టీడీపీకి రాజీనామా చేసి వెళ్లడం కామన్ గా మారింది. ఒకరకంగా చెప్పాలంటే ఎన్టీఆర్ హయాం నుంచి నేటి చంద్రబాబు హయాం వరకూ అదే పరిస్థితి. ఒకరో ఇద్దరో నమ్మకంగా ఉన్నారు. సింహభాగం రాజ్యసభ సభ్యులు ఇతర పార్టీల్లోకి వెళ్లారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ లో టీడీపీకి మూడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయడంతో మరొకసారి ఈ చర్చ పార్టీలో జరుగుతుంది. అయితే పార్టీకి దీర్ఘకాలం పనిచేసిన వారు కూడా గుడ్ బై చెప్పి వెళ్లిపోవడంతో దీనిని సెంటిమెంట్ గానే చూస్తున్నారు.

### నాలుగు దశాబ్దాల హిస్టరీ...

రాజ్యసభ పదవులు తెలుగుదేశం పార్టీకి కలసి రాలేదనే చెప్పడానికి గడచిన నాలుగు దశాబ్దాల చరిత్ర చూస్తే అర్థమవుతుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఇప్పటి వరకూ వీరితో కలిపి యాభై మందికి పైగానే పెద్దల సభకు వెళ్లారు. అయితే టీడీపీ ఓటమి కాగానే వారు పార్టీని వదిలి వెళుతున్నారు. ఎన్టీఆర్ సమయంలో నెంబర్ 2 గా ఉన్న ఉపేంద్ర రాజ్యసభ కు ఎన్నికయిన తర్వాత ఆయన కాంగ్రెస్ లోకి వెళ్లిపోయారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలోనూ నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయాలే ఇందుకు కారణాలని చెబుతున్నారు. పార్టీ ఒకసారి ఓడిపోతే చాలు.. ఇక పెద్దల సభలో పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి మొన్నామధ్య కనిపించింది. పార్టీకి అత్యంత నమ్మకమైన సుజనా చౌదరి, సీఎం రమేష్ లు బీజేపీలోకి వెళ్లారు. టీజీ వెంకటేశ్, గరికపాటి మోహనరావు కూడా జంప్ కొట్టారు.

### ఎవరికీ మినహాయింపు లేదు...

ఏకంగా రాజ్యసభలో టీడీపీని బీజేపీలో విలీనం చేశారంటే పెద్దల సభ టీడీపీకి కలసి రాలేదని అర్థమవుతుది.టీడీపీలో ఫైర్ బ్రాండ్ గా పేరు పొందిన రేణుకా చౌదరి లాంటి వారికి కూడా దీని నుంచి మినహాయింపు లేదు. అంతకు ముందు సి. రామచంద్రయ్య కూడా అదే పనిచేశారు. ఆయనను రాజ్యసభకు పంపినా ఆ తర్వాత ప్రజారాజ్యం పార్టీ, ఆ తర్వాత కాంగ్రెస్ లోకి వెళ్లి, అనంతరం వైసీపీలో చేరి తిరిగి టీడీపీలోకి వచ్చారు. రాజ్యసభ సభ్యుల ఎంపికలో లోపం ఎక్కడుందన్నది ఇప్పటికీ క్యాడర్ నుంచి లీడర్ల వరకూ అర్థం కాని ప్రశ్న. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నంత వరకూ పార్టీలో ఉంటారు. మరొకసారి రాజ్యసభ పదవిని రెన్యువల్ చేయకపోయినా, టీడీపీ ఓటమి పాలయినా సరే ఇక ఉండరు. దీంతో పెద్దల సభకు ఎంపిక చేయాలంటే నాయకత్వానికి ఒక సవాల్ గా మారింది. నాయకత్వం ఎన్ని రకాలుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయాలు కూడా రాజ్యసభ విషయంలో మాత్రం వర్క్ అవుట్ కావడం లేదు.

# సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం

- మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. “మంగళగిరిలో పార్టీ గెలిచి చాలా కాలమైంది. 2019లో లోకేష్ ఓడినా పట్టు వదలకుండా పనిచేసి, 2024లో అద్భుత విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. అందరూ లోకేష్‌లా పనిచేయాలి” అని ఆయన పిలుపునిచ్చారు. మంచి సంకల్పంతో పనిచేస్తే దానికి తగ్గ వాతావరణం దానంతట అదే ఏర్పడుతుందని, ‘ది సీక్రెట్’ పుస్తకాన్ని ప్రతి కార్యకర్తా చదవాలని సూచించారు.

### ‘గొడ్డలి పార్టీ’ చేతులెత్తేసింది

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. “మద్యపానం నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలిచ్చి ‘గొడ్డలి పార్టీ’ చేతులెత్తేసింది. వారు చెప్పినవి చేయకపోగా, మేం నిర్వహిస్తున్న డీఎస్సీ-2025పై బురదజల్లారు. వివేకా హత్య విషయంలో ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో, డీఎస్సీ విషయంలోనూ అదే ప్రయత్నం చేశారు. కానీ మేం ఆధారాలతో సహా కౌంటర్ ఇవ్వడంతో వారు డిఫెన్స్‌లో పడ్డారు. ఫేక్ రాజకీయాలు చేయడమే గొడ్డలి పార్టీ సిద్ధాంతం” అని ఆయన విమర్శించారు. తాము అధికారంలో ఉన్నందున సహనంతో ఉంటామని, అయితే ప్రతిపక్షం ఆగడాలు శ్రుతి మించితే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. “కూటమిగా వెళ్లాం కాబట్టే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచాం. ఓట్లు చీలకూడదనే బీజేపీతో పొత్తులో ఉన్నా టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కొనసాగించాలి” అని సూచించారు.“యుద్ధాన్ని గెలిపించే బాధ్యత నాది, నాతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత మీది. రాష్ట్రంలోని ప్రతి బూత్‌లో గతానికి మించి ఓట్లు రావాలి” అని శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గడప గడపకు వెళ్లి వివరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ప్రజలకు గుర్తు చేయాలని ఆదేశించారు.

# కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్

కూటమి ప్రభుత్వ వైఫల్యాల వల్ల నిరుద్యోగులు, రైతులు తీవ్రంగా మోసపోయారని వైసీపీ నేత, మాజీ మంత్రి కన్నబాబు విమర్శించారు. కాకినాడలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అందుకే అమరావతి రైతుల నుంచి డీఎస్సీ అభ్యర్థుల వరకు ప్రతి ఒక్కరూ ప్రస్తుతం జగన్ ను ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారని తెలిపారు.ప్రస్తుత రాజకీయాలపై స్పందిస్తూ... కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్ మాత్రమేనని కొనియాడారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవాళ్టికీ ఎందుకు ఇవ్వలేదని నిలదీసిన ఆయన... ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని కూటమి నేతలు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతూ ఈ ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని దుయ్యబట్టారు. జగన్ హయాంలో నడిచిన ‘అమ్మఒడి’ని కాపీ కొట్టి ‘తల్లికి వందనం’గా మార్చారని, అయినా దీని అమలులో కూటమి ప్రభుత్వం కనీసం పాస్ మార్కులు కూడా తెచ్చుకోలేకపోయిందన్నారు. ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఇస్తామన్న మాటను తుంగలో తొక్కి, ఏకంగా 20 లక్షల మంది విద్యార్థులకు మొండిచేయి చూపించారని ఆరోపించారు. ఈ పథకానికి రూ.13,112 కోట్ల బడ్జెట్ అవసరమైతే, కేవలం రూ.8,456 కోట్లే కేటాయించడాన్ని తప్పుబట్టారు.మరోవైపు, ఆక్వా రైతుల సమస్యలపై కూడా కన్నబాబు గళమెత్తారు. నిన్న జరిగిన ఎక్స్‌పోలో సీఎం చంద్రబాబు ‘బ్లూ ఎకానమీ’ అంటూ గొప్పలు చెప్పుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఆక్వా రైతులను ఆదుకోవడం లేదని విమర్శించారు. జగన్ హయాంలో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీలు ఇచ్చి, రొయ్యల మేత ధరలు పెరగకుండా నియంత్రణలో ఉంచామని గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే రొయ్యల మేత ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సీజన్ వచ్చేసరికి రొయ్యల ధరలను దారుణంగా పడిపోయేలా చేసి రైతులను నష్టాల్లోకి నెట్టేశారని కన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అసలు నువ్వెవరు? ప్రకాశ్ రాజ్‌పై జనసేన నేత తీవ్ర ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా సాగర్ ఘాటైన విమర్శలు చేశారు.“జనసేన ఒంటరిగా పోటీ చేస్తుందో, పొత్తుతో వస్తుందో ఆయనకెందుకు? అసలు ప్రకాశ్ రాజ్ ఎవరు? మేమెందుకు ఆయనకు సమాధానం చెప్పాలి?” అని సాగర్ సూటిగా నిలదీశారు. ప్రశాంతంగా ఉన్నవారిని కెలకడం ప్రకాశ్ రాజ్‌కు అలవాటని ఆరోపించారు.గద్దర్ అంశంపై మాట్లాడుతూ, “గద్దర్‌ను ఎవరు ఉపయోగించుకున్నారు? పవన్ కల్యాణ్ జేబు నుంచి నేరుగా డబ్బులు తీసుకునేంత చనువు తనకు ఉందని స్వయంగా గద్దరే చెప్పారు” అని ఆయన గుర్తుచేశారు. ప్రకాశ్ రాజ్ వృత్తిపరమైన ప్రవర్తనను కూడా సాగర్ ప్రశ్నించారు. “అసలు ఆయన ఎప్పుడైనా షూటింగ్‌కు సమయానికి వచ్చారా? మీరు ఎంత సహృదయులో మీ చిత్ర పరిశ్రమ వారిని అడిగితే తెలుస్తుంది” అంటూ ఎద్దేవా చేశారు.

ఈ దేశానికి, ప్రత్యేకించి తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన తోడ్పాటు ఏమిటని సాగర్ ప్రశ్నించారు. “తెలంగాణ సాయుధ పోరాటం, రజాకార్ ఉద్యమంలో పాల్గొని కుటుంబాలను పోగొట్టుకుంది ప్రకాశ్ రాజా?” అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “అసలు నువ్వెవరు ప్రకాశ్ రాజ్?” అని సూటిగా ప్రశ్నించిన ఆయన, తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన సేవ ఏంటని నిలదీశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు.

# గుడివాడ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

కృష్ణా జిల్లా గుడివాడ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. పట్టణ అభివృద్ధిపై వస్తున్న విమర్శలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దీటుగా స్పందించారు. గుడివాడ అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన సవాల్ విసిరారు.గుడివాడ హెడ్ వాటర్ వర్క్స్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.4.77 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రత్యర్థి పార్టీ చేస్తున్న నిరాధార విమర్శలను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, తాము కూడా వాటిని లెక్కచేయబోమని తేల్చిచెప్పారు. గుడివాడ ప్రజలకు దీర్ఘకాలికంగా సురక్షితమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో 35 వేల కుటుంబాలు ఉండగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 55 వేల కుటుంబాలకు సరిపడా నీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న సంపు పూర్తయితే హెడ్ వాటర్ వర్క్స్ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని ఆయన వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పనులన్నింటినీ ఇప్పుడు వేగంగా పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. తాము కేవలం అభివృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి కేంద్రీకరించామని, వ్యక్తిగత విమర్శలకు స్పందించాల్సిన అవసరం తమకు లేదని వెనిగండ్ల రాము కొట్టిపారేశారు.

# కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు

తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త వివాదానికి తెరలేపింది. హైదరాబాద్‌లోని ‘కోటిచెరువు’ శిఖం భూమిని పవన్ కల్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. పవన్ గనుక ఆ భూమిని ఆక్రమించలేదని చెబితే, వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా ‘శిఖం’ (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను ‘మాగాణి’ (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనే అని ఆమె ఎండగట్టారు.ఇటీవల పవన్ చేసిన “తెలంగాణ మీ అబ్బ సొత్తా.. మీ జాగీరా?” అనే వ్యాఖ్యలపై కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. “అవును, ఇది కచ్చితంగా మా జాగీరే! 1,200 మంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ఇది. ఇది తెలంగాణ ప్రజల సొత్తు, ఎవరి ముత్తాతలదో కాదు” అని కవిత ప్రతిస్పందించారు.ఆంధ్రప్రదేశ్‌లో రాజధానిని కూడా నిర్మించలేకపోయిన పవన్.. ఇప్పుడు తెలంగాణలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి సరైన స్థానిక నాయకులు లేకపోవడం వల్లే పవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు తాను కారు కొనిచ్చి సాయం చేశానన్న పవన్ వ్యాఖ్యలను కూడా కవిత తప్పుబట్టారు. నైజాం ఏరియా నుంచి తన సినిమాల ద్వారా కోట్లాది రూపాయల రెవెన్యూ సంపాదిస్తున్న పవన్.. ఇక్కడి జానపద కళాకారులను గానీ, చిన్న నిర్మాణాత్మక శక్తులను గానీ ఎప్పుడైనా ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. పైగా జానపద కళాకారుల ట్యూన్లను వాడుకుంటూ వారికి కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ఆసక్తికరమైన పోలికను తెరపైకి తెచ్చారు. “అప్పట్లో ఖ.ం.= (కేసీఆర్, టి. హరీశ్ రావు, రామారావు (కల్వకుంట్ల తారకరామారావు) పాలన అనుకుంటే.. ఇప్పుడు కూడా నడుస్తోంది ఖ= (కొండారెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి) పాలనే” అంటూ వ్యగ్యంగా కామెంట్ చేశారు. గతంలో దోపిడీకి కిటికీలు తెరిస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులే బార్లా తెరిచిందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఇలాగే అమ్మేసుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏమీ మిగలదని, ఈ ల్యాండ్ స్కామ్‌లన్నింటినీ తాము త్వరలోనే బయటపెడతామని కవిత హెచ్చరించారు.

# బొద్దింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం

- మొదటి పేజీ తరువాయి

జంతర్ మంతర్ వద్ద తొలిసారిగా ప్రత్యక్ష నిరసన కార్యక్రమం చేపట్టింది. “బొద్దింకలు రోడ్డెక్కలేవన్న వారికి సమాధానంగానే మేము ఇక్కడికి వచ్చాం” అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.నీట్-యూజీ పేపర్ లీక్, సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాల్లో దొర్లిన అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన నిర్వహించారు. ఈ నిరసనలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా పాల్గొన్నారు.కొద్దిరోజుల క్రితం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యువతలో కొందరిని ఉద్దేశించి ‘బొద్దింకలు’, ‘పరాన్నజీవులు’ అని చేసిన వ్యాఖ్యలకు వ్యంగ్య స్పందనగా ఈ పార్టీ ఆవిర్భవించింది. బోస్టన్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన అభిజిత్ దీప్కే, ఈ అవమానాన్ని యువత నిరాశకు, నిరుద్యోగానికి ప్రతీకగా మార్చి ఆన్‌లైన్‌లో ఉద్యమాన్ని ప్రారంభించారు. అనతికాలంలోనే లక్షలాది మంది మద్దతుదారులను సంపాదించుకున్న ఈ ఉద్యమం, ఇప్పుడు క్షేత్రస్థాయి పోరాటంగా రూపాంతరం చెందింది.

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యారంగ డిజిటలైజేషన్ లోపాలను సరిదిద్దడం, విద్యార్థులపై మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు చేపట్టడం వంటివి తమ ప్రధాన డిమాండ్లని నిరసనకారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఢిల్లీ పోలీసులు వెయ్యి మందికి పైగా సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్త చర్యగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

# స్పేర్‌సిటీ.. భవిష్యత్ టెక్నాలజీకి వారధి

- మొదటి పేజీ తరువాయి

మార్పులు, వాటి వినియోగంపై ఆయన ప్రత్యేకంగా ఆసక్తి కనబరిచారు.

ఈ సందర్భంగా, స్పేర్ బ్యాంక్‌కు చెందిన ఒక ప్రత్యేక ఏటీఎం మంత్రి లోకేష్ దృష్టిని ఆకర్షించింది. సాధారణ బ్యాంకింగ్ సేవలతో పాటు వ్యాధి నిర్ధారణ చేసే సామర్థ్యం ఉన్న ఈ ఏటీఎం పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. అక్కడి ఆవిష్కరణలను చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.అనంతరం, స్పేర్ సిటీ ప్రతినిధులు తమ సంస్థలో జరుగుతున్న పరిశోధనలు, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్ & డీ, క్వాంటం టెక్నాలజీ సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సేవలు, డిజిటల్ హెల్త్‌కేర్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఎడ్యుకేషన్ వంటి అంశాలపై తమకున్న పరిష్కారాలను వారు లోకేష్‌కు తెలిపారు.

# బెదిరింపులు వద్దు.. ప్రశ్నించడం మా హక్కు

- మొదటి పేజీ తరువాయి

ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు పెట్టిన పోస్ట్‌పై ప్రకాశ్ రాజ్ స్పందించారు.నాయకుడికి అన్నీ తెలుసని ఆయన మాటే శాసనం అని నాగబాబు పోస్ట్ పెట్టారు. నాయకుడి మాటను అనుసరించాలని కోరారు. ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని విజ్ఞప్తి చేస్తూ పవన్ ఫొటోను పంచుకున్నారు. ఈ పోస్ట్‌కు ప్రకాశ్ రాజ్ స్పందించారు. “మీ సందేహాలను పక్కనపెట్టండి. మౌనంగా నాయకుడిని అనుసరించండి అనడంలో మీ ఉద్దేశం ఏంటి. మేం జంతువులం కాదు మౌనంగా బతకడానికి. ఈ బెదిరింపులు వద్దు నాగబాబు గారు. ప్రశ్నించడం మా హక్కు. ఏ నాయకుడైనా, నేనే నాయకుడిని అనుకున్నవాడైనా, సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంటుంది” అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

## రుతుపవనాలు వచ్చేశాయి..

- మొదటి పేజీ తరువాయి

మే 26నే రుతుపవనాలు రాష్ట్రాన్ని పలకరించాయి.

ఈ నైరుతి రుతుపవనాల సీజన్‌లో (జూన్-సెప్టెంబర్ 2026) రాష్ట్రంలో వర్షపాతంపై ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. రుతుపవనాల గమనంలో తరచూ విరామాలు ఏర్పడవచ్చని, అంటే కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసి, ఆ తర్వాత కొంతకాలం వాతావరణం పొడిగా ఉండే సూచనలున్నాయని తెలిపారు. స్థానికంగా ఏర్పడే వాతావరణ మార్పుల వల్ల కురిసే వర్షాలు ఈ లోటును కొంతమేర భర్తీ చేయవచ్చని అంచనా వేశారు. మారుతున్న పరిస్థితులను గమనిస్తూ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రైతులకు సూచించారు.

### వివిధ ప్రాంతాల్లో వర్షపాత అంచనాలు:

సాధారణం కంటే తక్కువ: తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, పోలవరం, కర్నూలు, నంద్యాల, మార్కాపురం, అనంతపురం, కడప, నెల్లూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షపాతం తక్కువగా ఉండనుంది.

సాధారణం కంటే ఎక్కువ: ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఊరటనిచ్చేలా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది.

సాధారణ వర్షపాతం: శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో సాధారణ స్థాయిలో వర్షాలు పడనున్నాయి.

### రానున్న రెండు రోజుల్లో వాతావరణం

ఆది, సోమవారాల్లో కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, పల్నాడు, మార్కాపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడొచ్చు. అదే సమయంలో ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కోనసీమ సహా పలు జిల్లాల్లో 42-44 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడరాదని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

# హైదరాబాద్‌కు ఉపశమనం.. పలు ప్రాంతాల్లో వర్షం

- మొదటి పేజీ తరువాయి

నుంచి మోస్తరు వర్షం కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

శనివారం సాయంత్రం గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, ఉప్పల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట లభించింది. ఇక పొరుగున ఉన్న రంగారెడ్డి జిల్లాలోని కొహెడ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

# ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ



**అన్నవరం పెన్ పవర్ జూన్ 6:** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధానం లో శనివారం కావడంతోఘనంగా ప్రాకార సేవ నిర్వహించారు. ముందుగా అర్చకులు సత్యదేవుడు అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆగావించి వేద పండితుల మంత్రోచ్ఛరణ భక్తుల నామస్మరణతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించారు. ఈ ప్రాకార సేవా కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అర్చకులు మరియు దేవస్థానం సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమన్వయ సమావేశం





**కాకినాడ, పెన్ పవర్ జూన్ 6:** కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ప్రాసిక్యూషన్ డైరెక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

సమావేశంలో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, విచారణ దశలో ఉన్న ముఖ్యమైన కేసులు, వారెంట్ల అమలు, సాక్షుల హాజరు, చార్జ్‌షీట్ల దాఖలు, అప్పీలు మరియు ఇతర న్యాయపరమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు.కేసుల విచారణ సమయంలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మాట్లాడుతూ, కేసుల విచారణలో నాణ్యమైన సాక్ష్యాధారాలను సమర్పించడం ద్వారా నేరస్థులకు శిక్షలు పడే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారులు కేసు డైరీలు, ఫోరెన్సిక్ నివేదికలు, వైద్య ధ్రువపత్రాలు మరియు ఇతర సంబంధిత పత్రాలను సకాలంలో అందజేయాలని సూచించారు.కోర్టు కానిస్టేబుళ్లు సాక్షులకు సమన్లు అందజేయడం, వారిని కోర్టుకు హాజరు పరచడం, వారెంట్ల అమలు,న్యాయస్థానాల ఆదేశాల అమలులో ఎదురవుతున్న సమస్యలను సమావేశంలో వివరించారు.అదేవిధంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన కేసులు, పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, మహిళలపై నేరాలు మరియు ఇతర సున్నితమైన కేసుల విచారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమావేశంలో చర్చించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి కేసును బాధ్యతాయుతంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కోర్టు విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న సిబ్బందిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రాసిక్యూషన్ డైరెక్టర్ పి.వి. జయలక్ష్మి, ఎస్‌బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసరావు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ డి. దుర్గాశేఖర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఆన్‌లైన్ ద్వారా జిల్లా పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# శంఖవరం గ్రామానికి బైపాస్ రహదారి నిర్మించండి....

## సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాలని కమిటి నిర్ణయం...





**శంఖవరం పెన్ పవర్ జూన్ 06 :-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో మండల కేంద్రం శంఖవరం గ్రామం మీదుగా నిత్యం తిరుగుతున్న వందలాది భారీ టిప్పర్లతో నానా అవస్థలు పడుతున్నప్పటికీ ప్రజలు మా గ్రామానికి బైపాస్ రహదారి నిర్మించి తమను ఆదుకోవాలంటూ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళేందుకు నూతనంగా ఏర్పాటైన గ్రామ అభివృద్ధి కమిటి తీర్మానించింది. స్థానిక శివాలయం ఆవరణలో సామాజిక కార్యకర్త మేకల కృష్ణ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా రహదారి వెంబడి నివశిస్తున్న గృహస్తులు, దుకాణదారులు, గ్రామస్తులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేకల

కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే శంఖవరం గ్రామంలో టిప్పర్ల వల్ల రేగిన ధూళితో ఎంతోమంది ఊపిరితిత్తులు, కిడ్నీలు, తదితర సమస్యలతో బాధపడుచున్నారన్నారు. వీటికి తగిన మూల్యాన్ని ఇప్పటికే కొంతమంది భారీ మొత్తంలో వైద్యానికి చెల్లించుకున్నారన్నారు. డబ్బులు ఉన్నవాళ్ళు వైద్యం చేయించుకుంటున్నారని, లేనివాళ్ళ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వంతాడ, చింతలూరు, శరభవరం లాటరైట్ క్వారీలకు ప్రత్యేక రహదారిని నిర్మించుకుని జాతీయ రహదారికి వెళ్ళుతున్నాయని, అదేవిధంగా ఎస్ పైడిపాల నుండి కత్తిపూడి జాతీయ రహదారికి ప్రత్యేకరహదారి నిర్మించుకుని తమకు నచ్చిన సరుకులను తరలించుకోవాలని, దీనికి మేము వ్యతిరేకం కాదన్నారు. కాని మాకు శంఖవరం గ్రామం, గ్రామ ప్రజల ప్రాణ రక్షణ, ఆరోగ్యం ముఖ్యమని సమావేశంలో తేల్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బొర్రా సత్య నారాయణ (దొంగబాబు), జట్లా లచ్చారావు, గంద్రేటి సత్య నారాయణ, పిల్లా సత్య నారాయణ, రేలంగి దొంగబాబు, (చిట్టిబాబు), సుబ్బారావు, గవరసాని రాంబాబు, బొమ్మిడి సత్య నారాయణ పర్వత రామకృష్ణ, రేలంగి వెంకట సత్య నారాయణ (దొంగబాబు) తదితరులు పాల్గొన్నారు.

# పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై ప్రత్యేక డ్రైవ్



**కాకినాడ, పెన్ పవర్,జూన్ 6:** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో శనివారం కాకినాడ ట్రాఫిక్-1 పోలీసులు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా 25 మంది ఆటో డ్రైవర్లను వారి వాహనాలతో సహా ట్రాఫిక్-1 పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ట్రాఫిక్ నిబంధనలు, ప్రయాణికుల భద్రత, వాహనాల నిర్వహణపై ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు.ప్రయాణికుల ఆటోలలో (3o1) మందికి, స్కూల్ పిల్లల ఆటోలలో (6o1) మందికి మించి ఎక్కించరాదని, వాహనాలను సురక్షితంగా నడపాలని పోలీసులు సూచించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఐరన్ గ్రిల్స్, సైడ్ మిర్రర్లు, నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.


అదేవిధంగా ఆటోలకు సంబంధించిన పర్మిట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను తనిఖీ చేశారు.సైబర్ నేరాలపై కూడా డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్లు, నకిలీ ఉద్యోగ అవకాశాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112/100, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930, ఇతర సహాయ సేవల కోసం 1972 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించు కోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ఎస్‌ఐలు బి. శంకరరావు, పి. కిషోర్ కుమార్, సి.హెచ్. బోసుబాబు, బి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఏడు శనివారాల వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి









- **వాడపల్లి చందన వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి ఎ. అభిషేక్ రెడ్డి**
- **గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయ మాడవీధులు**

**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 6:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి ఏడు వారాల చందన వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులతో ఆలయ ప్రాంగణం, మాడవీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

వేకువజామున ఆలయ అర్చకులు స్వామివారికి మేలుకొలుపు సేవ, ఐశ్వర్య లక్ష్మీ హోమం, అలంకారోత్సవం, సుప్రభాత సేవలను శాస్త్రోక్తంగా, వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం తొలి హారతి అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ఏడు వారాల నోములు నోసుకున్న భక్తులు ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహిస్తూ "గోవిందా.. గోవిందా.." నామస్మరణతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గోవింద నామసంకీర్తనలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అవసరమైన సదుపాయాలపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పాట్నా హైకోర్టు న్యాయమూర్తి ఎ. అభిషేక్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి చందన స్వరూపుడైన శ్రీ వెంకటేశ్వరస్వామినిదర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి న్యాయమూర్తిని సత్కరించారు.ఏడు శనివారాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కళకళలాడగా, కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి క్షేత్రం మరోసారి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పింది.

# శ్రీ సత్యదేవుని సన్నిధిలో త్రిపుర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు



**అన్నవరం పెన్ పవర్ జూన్ 6:**కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారిని త్రిపుర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు శనివారం కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారి దర్శించుకున్నారు.

ఆలయానికి విచ్చేసిన జస్టిస్ రామచంద్రరావు కి దేవస్థానం ఏఈఓ ఎల్. శ్రీనివాసరావు, ఆలయ సాంప్రదాయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు జస్టిస్ రామచంద్రరావు కుటుంబ సభ్యులకు వేద ఆశీస్సులు (ఆశీర్వచనం) అందజేశారు. ఆలయ ఏఈఓ శ్రీనివాసరావు జస్టిస్ రామచంద్రరావు కి శ్రీ స్వామివారి శేష వస్త్రమును, ప్రసాదము మరియు శ్రీ స్వామివారి చిత్ర పటమును అందజేశారు .

ఈ కార్యక్రమంలో గణపతి, స్థానిక ఎస్.ఐ. శ్రీహరిబాబు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ. 1,00,000/-లు విరాళం



**అన్నవరం పెన్ పవర్ జూన్ 6:**కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి హైదరాబాద్ వాస్తవ్యులు పోచిరాజు వెంకటరామయ్య రూ. 1,00,000/-లు విరాళంగా దేవస్థానం ఏ ఈ ఓ శ్రీనివాసరావుకు అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ఏప్రిల్ 10వ తారీఖున అన్నదానం జరిపించాలని దాత కోరినారు. దాతను దేవస్థాన అధికారులు అభినందించారు

# జగ్గంపేటలో ఆపరేషన్ వజ్రప్రహార్ కార్డెన్ సెర్చ్



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 6**: ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా శనివారం జగ్గంపేట జగనన్న కాలనీలో మెగా కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. 20 మంది పోలీసు అధికారులు సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాలు వివరాలు తెలుసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు. 150 మంది వ్యక్తులను తనిఖీ చేసి 100 వాహనాలను పరిశీలించి సరైన పత్రాలు లేని పది వాహనాలను గుర్తించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ సీట్లు ఉన్న వ్యక్తులను స్పాట్లో పిలిపించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి సత్ ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి ఇతర మాదకద్రవ్యాలు వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని కుటుంబ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు, గండేపల్లి ఎస్సై శివ నాగబాబు సిబ్బంది ఉన్నారు.

# ఏలేశ్వరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం.

- పలు చోట్ల విద్యుత్ కు అంతరాయం.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 6**: మండల కేంద్రం ఏలేశ్వరంలో శనివారం సాయంత్రం భారీ ఈదురు గాలులు వీచాయి. కానీ పది నిమిషాలపాటు స్వల్పంగా వర్షం కురిసింది. చాలా కాలంగా తీవ్రమైన వర్షాభావ పరిస్థితిలో అధిక ఉష్ణోగ్రత, ఉక్క పోత దీంతో అల్లాడిపోతున్న జనానికి హఠాత్తుగా వాతావరణం మేఘావృతమై బలమైన గాళ్లు వీస్తుండడంతో భారీ వర్షం కురుస్తుందని ఆశించారు. కానీ ఓ మాస్టర్ చినుకులతో సరిపెట్టడం తో ప్రజలు నిరాశకు గురయ్యారు. ఈదురుగాలుల ధాటికి పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పునరుద్ధరిస్తారని ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# కొబ్బరి, క్వాయర్ పరిశ్రమలకు అంబేడ్కర్ కోనసీమలో ప్రోత్సాహం..

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**కోనసీమ బ్యూరో (అమలాపురం ) పెన్ పవర్ జూన్, 6:** డాక్టర్.బిఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి, క్వాయర్ విలువాధారిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేరళ, తమిళనాడు తరహాలో మార్కెట్ డిమాండ్ ఉన్న ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను జిల్లాలో నెలకొల్పాలని సూచించారు.

కొబ్బరి బోర్డు, క్వాయర్ బోర్డు అధ్యయనం చేసి అనువైన పరిశ్రమలపై త్వరితగతిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ, కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల తయారీకి కార్యాచరణ రూపొందించి, ఎంఎస్ఎంఈ పథకాల ద్వారా యువత, మహిళలను ప్రోత్సహిస్తామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.




# ర్యాలి కేశవస్వామిని దర్శించుకున్న త్రిపుర ప్రధాన న్యాయమూర్తి ఎం ఎస్ రామచంద్రరావు






పాట్నా హైకోర్టు న్యాయమూర్తి ఏ .అభిషేక్ రెడ్డి

**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 6:**కోనసీమ జిల్లాలోని ర్యాలి గ్రామంలో వెలసిన ప్రాచీన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ జగన్మోహిని కేశవస్వామి దేవస్థానాన్ని త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎస్. రామచంద్రరావు, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి ఎ. అభిషేక్ రెడ్డి శనివారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, ఖండవల్లి సీతారామాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, న్యాయమూర్తులు భక్తిశ్రద్ధలతో సేవల్లో పాల్గొన్నారు. అనంతరం పాట్నా న్యాయమూర్తి ఏ అభిషేక్ రెడ్డి స్వామివారి అన్నదాన పథకానికి రూ.10,116లను విరాళంగా సమర్పించారు.అలాగే హైదరాబాద్ మహానగరానికి చెందిన తోలేటి ఉదయ్ కిరణ్--శ్రీ సాయిరమ్య దంపతులు రూ.5,116లు, చిలకపాడు చిమ్మా నాగేశ్వరరావు--సుధ దంపతులు రూ.10,116లు అన్నదాన పథకం కోసం విరాళాలుగా అందజేశారు. ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అసిస్టెంట్ అధికారి వై. శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటాలను అందించి అతిథులను ఘనంగా సత్కరించారు.

భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకుంటుండటంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల సహకారంతో అన్నదాన పథకం నిరంతరం కొనసాగుతుండటం విశేషమని ఆలయ అధికారులు తెలిపారు.

# సబ్సిడీ ఎరువుల పంపిణీ లో కొత్త విధానం:ఎం ఏ ఓ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 6:** రైతులకు అందిస్తున్న సబ్సిడీ ఎరువుల పంపిణీలో కొత్త విధానం అమల్లోకి వచ్చిందని ఏలేశ్వరం మండల వ్యవసాయ అధికారి ఏవి రాజేష్ శనివారం ప్రకటించారు.కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సబ్సిడీ ఎరువుల పంపిణీలో కొత్త విధానం ఎన్ ఎస్ ఎఫ్ ఎస్ (నేషనల్ ఫెర్టిలైజర్ సేల్ (ఫ్రేమ్ వర్క్) అమలులోనికి వచ్చిందని ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నూతన సేల్స్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం, రైతులకు వారి భూమి విస్తీర్ణం , పంట రకాలను బట్టి అవసరమైన మేరకే సబ్సిడీ ఎరువులను కేటాయించనున్నారు. ముఖ్యంగా యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువుల దుర్వినియోగాన్ని, బ్లాక్ మార్కెటింగ్‌ను సమర్థవం తంగా అరికట్టడం , అర్హులైన ప్రతీ రైతుకు సకాలంలో స్టాక్ అందేలా చూడటం ఈ ఫ్రేమ్‌వర్క్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కొనుగోలు వివరాలన్నీ ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా డిజిటల్ రూపంలో పర్యవేక్షించ బడతాయన్నారు. ఎన్ ఎఫ్ ఎస్ యాప్ ను వినియోగించుకొని రైతులు తమకు అవసరమైన ఎరువులను స్వయంగా ఎంపిక చేసుకోవచ్చు. సమీప రిటైలర్‌ను ఎంచుకోవచ్చు. ఒకేసారి పలు రకాల ఎరువులను ఎంచుకునే సౌకర్యం, అందుబాటులో ఉన్న ఎరువుల లభ్యతను తెలుసుకోవచ్చు. అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా రైతులు ఎరువులు పొందవచ్చు అని తెలిపారు. మరిన్ని వివరాలకు మీ సమీప రైతు సేవా కేంద్రాల ద్వారా సలహాలు సూచనలు పొందవచ్చని ఎంఏఓ తెలిపారు.


# శంఖవరం తహశీల్దార్ గా సూరిబాబు



**శంఖవరం పన్ పవర్ జూన్ 06** :-కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం నూతన తహశీల్దార్ గా మొసలి సూరిబాబు నియమితులయ్యారు.

ప్రభుత్వం కాకినాడ జిల్లా పరిధిలో కొందరు రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు, మరికొందరికి సాధారణ బదిలీలు నిర్వహించింది. ఈ బదిలీల్లో తాళ్ళరేవు డిప్యూటి తహశీల్దార్ గా పనిచేస్తున్న మొసలి సూరిబాబు తహశీల్దార్గా పదోన్నతి పొందడంతో శంఖవరం తహశీల్దార్ గా నియమితులయ్యారు. గతంలో శంఖవరం తహశీల్దార్ కార్యాలయం టైపిస్టుగా పనిచేసిన శంఖవరం మండల ప్రజానికానికి సుపరిచితులే. ఇప్పటి వరకు శంఖవరం తహశీల్దార్ గా పనిచేస్తున్న అడ్డాల తాతారావు కాకినాడ ఆర్టీఓ కార్యాలయం పరిపాలన అధికారిగా బదిలీ అయ్యారు.

# ముగిసిన రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్






**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 6:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో “కంప్యూటర్ విజన్ కోసం జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్” అనే అంశంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మరియు కంప్యూటర్ విజన్ సాంకేతికతలు విద్యా, పరిశోధన మరియు పారిశ్రామిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో అధ్యాపకులకు ఈ ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని వైస్ ఛాన్సలర్. ప్రొఫెసర్ డా. ఎం.బి. శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ సమాచార సాంకేతిక సంస్థ (ట్రిపుల్ ఐ.టి ), నాగపూర్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు డీఎల్ఐ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ డా. నిలేష్ చంద్ర కె. పిక్లే హాజరై అధ్యాపకులకు ప్రయోగాత్మక శిక్షణ విజ్ఞానదాయకంగా ఫలప్రదం గా సాగింది . ఈ శిక్షణ ద్వారా అధ్యాపకులు బోధన, పరిశోధన మరియు విద్యార్థుల ప్రాజెక్టుల లో కృత్రిమ మేధస్సు మరియు జీపీయూ ఆధారిత సాంకేతికతలను సమర్థవంతంగా వినియోగించే నైపుణ్యాలను పొందారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులకు పరిశోధన దృక్పథాన్ని పెంపొందించుకోవడం తో పాటు, ఆధునిక కంప్యూటర్ విజన్ మరియు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా నిలిచింది అని నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్) డా. ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ మరియు సైన్సెస్) డా. ఎ. రమేష్, రిజిస్ట్రార్ డా.జి.సురేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి డా. మాకినీడి రాజా బాబు, కార్యక్రమం కోఆర్డినేటర్ డా. పి. శివ సత్య ప్రసాద్, కో-కోఆర్డినేటర్ డా. కర్ణం శ్రీను మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# దక్షిణ కోస్తా రైల్వే ఆఫీస్ తొలి సూపరిండెంట్ గా చిల్లంగి గ్రామానికి చెందిన కర్రి వెంకటలక్ష్మి.






**-స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం ఆపై అనేక పదోన్నతులు.**

**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 4:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నం వేదికగా ఏర్పాటుచేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆఫీసులో తొలి ఆఫీస్ సూపర్డెంట్ గా కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన కర్రి వెంకటలక్ష్మి శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇప్పటివరకు సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే బిలాస్పూర్ లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలో నూతనంగా దక్షిణ కోస్తా రైల్వే జూన్ ఏర్పడడంతో బిలాస్పూర్ నుండి విశాఖపట్నం బదిలీపై వచ్చారు. వెంకటలక్ష్మి మొదటి పోస్టింగ్ 2009 లో స్పోర్ట్స్ కోటాలో సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే లో ఉద్యోగంలో జాయిన్ అయ్యారు. తర్వాత భారతీయ రైల్వేస్ కి అనేకసార్లు స్వర్ణ పథకాలు సాధించారు. 2010 లో చైనాలో జరిగిన ఆసియన్ గేమ్స్ లోను 2011 లో ఇండోనేషియాలో ఏషియన్ ఛాంపియన్షిప్ వంటి ఇంటర్నేషనల్ టోర్నమెంట్ లో మన భారతదేశ తరఫున పాల్గొని అనేక పథకాలు సాధించారు. ఈమె సాధించిన మెడల్స్ గాను 2012లో ఇండియన్ రైల్వేస్ సీనియర్ క్లర్క్ గా 2016 లో ఆఫీస్ సూపర్డెంట్ గా పదోన్నతి కల్పించారు.

ఈమె భర్త కర్రి శ్రీనివాసరావు కూడా అంతర్జాతీయ క్రీడాకారుడు. భార్య,భర్తలు ఇద్దరూ కూడా ఆటల ద్వారానే భారతీయ రైల్వేలో ఉద్యోగం పొంది అనేక జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించారు. భార్య,భర్తలిద్దరూ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించి చిల్లంగి గ్రామం పేరు ప్రఖ్యాతుల్ని అంతర్జాతీయ వేదికపై తీసుకెళ్తున్న వెంకటలక్ష్మి శ్రీనివాసరావులను పలువురు అభినందిస్తున్నారు. యువత వీరిని ఆదర్శంగా మంచి ఉద్యోగాలు సాధించి భవిష్యత్తులో స్థిరపడాలని ఆశిద్దాం.




## వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం




**కాకినాడ, పెన్ పవర్ జూన్ 6:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గత 45 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ అందించిన ఉపాధ్యాయులకు, శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతిరాజు ఈశ్వర్‌రాజు వర్మ, గ్రంథాలయ కార్యదర్శి కె.జె.ఎస్.ఎల్.కుమారి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ,ప్రతి ఒక్కరి జీవితంలో పుస్తక పఠనం అత్యంత ముఖ్యమని అన్నారు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెరగడంతో పాటు సమాజం, పర్యావరణం,కుటుంబ విలువలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి కలెక్టర్లు, వైద్యులు, పోలీసు అధికారులు వంటి ఉన్నత స్థానాలను అధిరోహించగలరని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతిరాజు ఈశ్వర్‌రాజు వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సిబ్బంది,ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసి, వచ్చే ఏడాది వేసవి విజ్ఞాన శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించి విద్యార్థులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రంథాలయ కార్యదర్శి కె.జె.ఎస్.ఎల్. కుమారి మాట్లాడుతూ, 45 రోజుల పాటు నిర్వహించిన శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేయడంతో పాటు ఉచితంగా శిక్షణ అందించిన ఉపాధ్యాయులను సత్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య ఉపసంచాలకులు పసుపులేటి పాసయ్య, ఉప గ్రంథాలయ అధికారి ఇన్‌చార్జి కే. కిషోర్, ఎం.శ్రావ్య,ఎస్. రాజు,టి. సాయి,ఏవీఎస్ నాగేంద్రకుమార్, వి.అరుణ,ఎన్‌వీఎస్ ఫణీంద్రకుమార్, టి.వీర్రాజు,జై దుర్గాప్రసాద్,ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్క నాటిన ముత్త నవీన్



**కాకినాడ, పెన్ పవర్ జూన్ 6:** ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా కాకినాడ గాంధీనగర్ రైతు బజార్ ఆవరణలో శనివారం మొక్కల నాటకం కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 41వ డివిజన్ బీజేపీ నాయకుడు కవికొండల చలపతిరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి ముత్త గోపాలకృష్ణ తనయుడు ముత్త నవీన్ కృష్ణ కూటమి నాయకులతో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ముత్త నవీన్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు సామాజిక బాధ్యతగా కనీసం ఒక మొక్కను నాటి, అది పెరిగే వరకు సంరక్షించాలని సూచించారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. కవికొండల భీమశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. తల్లిని ఎంత ప్రేమగా చూసుకుంటామో, అదే విధంగా మొక్కలను కూడా సంరక్షించి పెంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి సత్యకుమార్, జొన్నాడ వెంకటరమణ, దంగేటి పద్మావతి, వాసంశెట్టి శ్రీనివాస్, కోకా సత్తిబాబు, విద్యాసాగర్, బసవ శ్రీనివాస్, లోకనాథ్, గుండు శ్రీనివాసరావు, నారాయణమూర్తి, ధోనీ ప్రసాద్, సూరిబాబు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం







**రూ.111 కోట్ల ఆర్థిక సాయాన్ని పంపిణీ చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**రావులపాలెంలో రూ.1.52 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**

**పెన్ పవర్ రావులపాలెం, జూన్ 6:** రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, గ్రామీణ అభివృద్ధి, పేదరిక నిర్మూలన సంస్థ, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రావులపాలెంలో నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా వీజీబీఎంఆర్జీ నిధుల ద్వారా రూ.1 కోట్ల వ్యయంతో జూనియర్ కళాశాల నుంచి శ్మశానవాటిక వరకు బీటీ రహదారి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.40 లక్షలతో 6వ వార్డులో వాటర్ ట్యాంకు వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, గ్రామపంచాయతీ నిధులతో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ప్రారంభించారు. మొత్తంగా రూ.1.52 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి వివిధ పథకాల కింద లబ్ధిదారులకు రూ.111.19 కోట్ల విలువైన ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. ఇందులో ఎంఎస్‌ఎంఈల ద్వారా 82 మందికి రూ.4.86 కోట్లు, పీఎంఏజేవై కింద 30 మందికి రూ.33 లక్షలు, ట్రైకేర్ పథకం ద్వారా ముగ్గురికి రూ.3 లక్షలు, 588 స్వయం సహాయక సంఘాలకు రూ.106 కోట్ల బ్యాంకు లింకేజీ సాయం అందించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి సాధించడమే ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్-2047 లక్ష్యమని చెప్పారు. ఎంఎస్‌ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ఎగుమతులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. స్వయం ఉపాధి రంగానికి ప్రాధాన్యం ఇస్తూ యువతకు అవకాశాలు కల్పించాలన్నదే మంత్రి నారా లోకేష్ సంకల్పమని పేర్కొన్నారు. రావులపాలెం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి ప్రశంసించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే యువతకు మార్గదర్శకత్వం కల్పించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.


అనంతరం రాజకీయ అంశాలపై స్పందించిన మంత్రి, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించినప్పటికీ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సాగునీటి రంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, ప్రస్తుతం గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని అంశాలను గమనిస్తున్నారని, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## వరి నుండి ఆయిల్ ఫామ్ కు పంట మార్పిడి పరిశీలించిన- జిల్లా అధికారి టి, వీర సిరిల్



**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 6:** గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ఊరి నుండి ఆయిల్ ఫామ్ కు పంట మార్పిడి చేసిన పొలాలను శనివారం ఉద్యానవన శాఖ జిల్లా అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ ఫామ్ తోటల పెంపకం కోసం ప్రభుత్వం పూర్తి రాయితీ కల్పిస్తుందని అంతేకాకుండా అన్ని పంటల కన్నా ఆయిల్ ఫామ్ ద్వారా రైతులు అధిక లాభాలను సాధించవచ్చునని తెలియజేశారు. అనంతరం గ్రామంలో ఉన్న
వరి నుండి ఆయిలపామ్ కు పంట మార్పిడి 35 ఎకరాల లో నూతనంగా ఆయిలపామ్ సాగు చేస్తున్న రైతుల తోటలను ఆయన పరిశీలించారు. రైతులకు ఆయిలపామ్ సాగుకు అందుబాటులో ఉన్న 100 శాతం మొక్కల రాయితీ.
మైంటెనెసన్స్ 5250 రూ 4 సంవత్సరాలకు గాను 21000 రూ
అంతర పంటల ప్రోత్సహకాలు అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి ఏ .శ్రీవల్లి, కోరారు. ఈయన వెంట సహాయకులు కె . లావణ్య పతంజలి సిబ్బంది రైతులు ఉన్నారు.

## బెహ్రాయిన్‌లో మృతి చెందిన యువతి మృతదేహం స్వగ్రామానికి చేరిక



**కోనసీమ బ్యూరో (రాజోలు) పెన్ పవర్, జూన్, 6:** బెహ్రాయిన్‌లో మృతి చెందిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ గ్రామానికి చెందిన బల్ల శైలు (23) మృతదేహాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు.

ఉపాధి నిమిత్తం ఆరు నెలల క్రితం బెహ్రాయిన్ వెళ్లిన శైలు గృహ కార్మికురాలిగా పనిచేస్తుండగా, మే 25న మృతి చెందినట్లు సమాచారం అందింది. కుటుంబ సభ్యుల విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యం లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ (కే సి ఎం ) స్పందించి, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసి మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఏ పి ఎన్ ఆర్ టి , భారత రాయబార కార్యాలయం సహకారంతో అన్ని అధికారిక ప్రక్రియలు పూర్తి చేసి మృతదేహాన్ని కార్గో విమానం ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో ఈదరాడ గ్రామానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, కేసీఎం సమన్వయ అధికారి గోళ్ళ రమేష్, సిబ్బంది కడియాల సత్తిబాబు, ఎస్.ఎం. సఫియా, లీగల్ అడ్వైజర్ శంకర్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులు, పేదలకు ఆర్థిక భరోసా
## కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు





**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 6** గండేపల్లి మండలంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు, పేదలకు ఆర్థిక సహాయం కొనసాగుతున్నాయి.
ఇటీవల నేషనల్ ఎగ్ కార్ట్ సంస్థ ద్వారా 100% సబ్సిడీతో రూ.50,000 విలువైన ఎగ్ కార్ట్ బాక్స్‌ను గండేపల్లి గ్రామానికి చెందిన కటకం ధనలక్ష్మికి అందజేశారు.
గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పోతుల మోహన రావు వారి షాపును ఆకస్మికంగా సందర్శించి వ్యాపార వివరాలు తెలుసుకున్నారు. రోజుకు రూ.1000 ఆదాయం వస్తుందని ధనలక్ష్మి తెలిపారు. పేదలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మోహన రావు పేర్కొన్నారు. అనంతరం సింగరం పాలెం గ్రామంలో రూ.80 లక్షల కేంద్ర నిధులతో పూర్తయిన సిమెంట్ రోడ్డును కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన రావు పరిశీలించారు. రోడ్డు నాణ్యత కోసం ఆయన స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ వాటరింగ్ చేశారు.
మోహన రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే రాష్ట్రంలో వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేశామని, జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో నియోజకవర్గంలో దాదాపు అన్ని రోడ్లు సిమెంట్ రోడ్లుగా మారాయని తెలిపారు. ప్రతి పైసా ప్రజల సొమ్మేనని, నాణ్యతలో రాజీ లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలలో బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంపాటి రాజు
అక్కిన సుదర్శన్ రావు, అక్కిన నాగేశ్వరరావు, కుక్కల రమేష్, ఈ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో బాధితులకు ఊరట..
## రూ.6.53 కోట్ల మెగా చెక్ పంపిణీ




**కాకినాడ, పెన్ పవర్,జూన్ 6 :**కాకినాడ అర్బన్ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి కూడా గృహాలు పొందలేకపోయిన లబ్ధిదారులకు వారి సొమ్మును తిరిగి చెల్లించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుమతితో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శనివారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో రూ.6.53 కోట్ల మెగా చెక్కును బాధితులకు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ,2014-19 కాలంలో పేద,మధ్యతరగతి కుటుంబాలకు నగర పరిధిలోనే సొంత గృహాలు అందించాలనే లక్ష్యంతో పోర్టు అధికారుల సహకారంతో కాకినాడలో 4,554 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.ఇందులో 1,150 డబుల్ బెడ్‌రూమ్,904 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు వివరించారు.
అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత టిడ్కో గృహాల నిర్మాణం, పంపిణీ ప్రక్రియలో జాప్యం ఏర్పడటంతో లాటరీల్లో ఎంపికైన పలువురు లబ్ధిదారులు కూడా ఇళ్లు పొందలేకపోయారని తెలిపారు.ఇల్లు వస్తుందనే ఆశతో తమ కష్టార్జిత సొమ్మును చెల్లించిన కుటుంబాలు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో టిడ్కో బాధితుల నుంచి పెద్దఎత్తున వినతులు అందాయని,ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ఇళ్లు పొందని లబ్ధిదారులకు వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించే ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.
కాకినాడ నగరంలో మొత్తం 739 మంది లబ్ధిదారులకు రూ.6.53 కోట్లను చెక్కుల రూపంలో అందజేసినట్లు వెల్లడించారు. టిడ్కో బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు,టీపీఆర్వో శైలజ, మెప్మా సి.ఎం.ఎం.రాజు,గదుల సాయిబాబా, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమాలి గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పోటీలు.






**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 6:** మండల పరిధి తిరుమాలి గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పోటీలు శనివారం ఘనంగా నిర్వహించారు. తిరుమాలి గ్రామంలో శ్రీ నేరేళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ప్రతి ఏటా ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించడం సాంప్రదాయంగా పాటిస్తున్నారు.గ్రామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 15వ రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో మొత్తం 34 ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో 7, జూనియర్ విభాగంలో 27 ఎడ్లబండ్లు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో గుమ్మలూరు కు చెందిన కీర స్తుతి చౌదరి, అనకాపల్లి కి చెందిన సిద్ధి వినాయక, వల్లపూడి గ్రామానికి చెందిన శ్రీ సిద్ధి వినాయక ఎడ్లబండ్లు పరుగుల పందెంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ సాధించాయి. అలాగే జూనియర్ విభాగంలో ఏలేశ్వరం తిరుమల గ్రామానికి చెందిన
మాగాపు రాంబాబు ఎడ్లబండి ప్రథమ బహుమతి సాధించగా, మండపేట, గుమ్మలేరుకు చెందిన ఎడ్లబండ్లు ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నాయి. ఈ కార్యక్రమానికి డీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి పోటీదారుడికి కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు.
న్యాయ నిర్ణేతలుగా సిద్ధా నానాజీ, యనమల కృష్ణ, కె. కోటేశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సూతి బాబులు, చందువోలు రాజా మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేందుకు గత 15 ఏళ్లుగా నేరేళ్ళమ్మ జాతర సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నిరంతరం వ్యవసాయ పనుల్లో అలసిపోయిన రైతులకు ఆటవిడుపుగా ఉంటుందని, ప్రతి ఏటా రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూతి బూరయ్య, పసల సూరిబాబు, ఓలేటి చంటిబాబు, వరుపుల సాయి, కోరుకొండ నూకరాజు, కానూరి రాంబాబు, కోలా వీరబాబు, మాగాపు వీరబాబు, ఊర నాని, చిక్కాల లక్ష్మణరావు, రైతులు పాల్గొన్నారు.



## యోగాంధ్ర-2026 కార్యక్రమాలను ఉద్యమ స్థాయిలో నిర్వహించాలి







### జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ, పెన్ పవర్ జూన్ 6:**కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న 'యోగాంధ్ర-2026' కార్యక్రమాలు, జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఉద్యమ స్థాయిలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో యోగాంధ్ర-2026 నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, యోగా కేంద్రాల ప్రతినిధులు, యోగా గురువులతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 7 నుంచి 21 వరకు 14 రోజుల పాటు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా భాగస్వామ్యంతో యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా జూన్ 7న ఉదయం 6 గంటలకు కలెక్టర్ కార్యాలయం నుంచి రాజాట్యాంక్ వరకు యోగా చైతన్య ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. యోగాచార్యులు, శిక్షకులు, ఉద్యోగులు, యువత పాల్గొనే ఈ ర్యాలీ అనంతరం మూడు లైట్ల జంక్షన్ వద్ద యోగా కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్, ఆయుష్ శాఖ అధికారులకు సూచించారు.అలాగే జూన్ 8న అన్నవరంలో, జూన్ 16న సామర్లకోటలో టూరిజం డెస్టినేషన్ యోగా కార్యక్రమాలు, జూన్ 13న ఉపాధ్యాయులతో థీమాటిక్ యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు.గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన శిక్షకులను గుర్తించి మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ అందించాలని పేర్కొన్నారు.యోగా అంశాలపై వ్యాసరచన,నినాద రచన, యోగా క్విజ్ పోటీలు, అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించాలని సూచించారు.
యోగాంధ్ర కార్యక్రమాల పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల, గ్రామ స్థాయిల్లో కూడా కమిటీలు ఏర్పడి కార్యక్రమాలను పర్యవేక్షిస్తాయని చెప్పారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్లు, పాల్గొనేవారి వివరాలు, వేదికల సమన్వయం,నివేదికల అప్‌లోడింగ్ వంటి అంశాలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు.
ఆయుష్, విద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిపాలన, పర్యాటక, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు.
ఈ సమావేశంలో నోడల్ అధికారి, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఎం.ఎస్. ఆలీ, కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, యోగా గురువులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అన్నవరం దేవస్థానంలో పనిచేయని డిస్ప్లే బోర్డులు





### అయోమయంలో భక్తులు

**కాకినాడ బ్యూరో (అన్నవరం) పెన్ పవర్ జూన్, 6:**కాకినాడ జిల్లా ప్రముఖ
పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతికత అలంకారప్రాయంగా మారింది. కొండపైకి వచ్చే భక్తులకు వసతి గదుల లభ్యతను (రూములు ఎన్ని ఖాళీగా ఉన్నాయి, ఏ కేటగిరీలో ఉన్నాయి) ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు దేవస్థానం అధికారులు లక్షల రూపాయల వ్యయంతో డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే, ప్రస్తుతం ఇవి పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
?అధికారుల నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం
?ముఖ్యంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే 'తొలి పావంచాల' (తొలి మెట్లు) వంటి కీలక ప్రాంతంలో ఏర్పాటు చేసిన డిస్ప్లే బోర్డులు పూర్తిగా మూలపడ్డాయి. కొండపైకి కాలినడకన లేదా వాహనాల్లో వెళ్లే భక్తులకు ఏ రూములు ఖాళీగా ఉన్నాయో ఇక్కడే తెలియాల్సి ఉండగా, బోర్డులు పని చేయకపోవడంతో గదుల కోసం ఎక్కడికి వెళ్లాలో అర్థం కాక తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఒక కౌంటర్ నుంచి మరో కౌంటర్‌కు తిరగలేక వృద్ధులు, పిల్లలతో వచ్చిన కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయి.
?"లక్షల రూపాయల భక్తుల సొమ్ముతో బోర్డులు ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను గాలికి వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం" అని పలువురు భక్తులు మండిపడుతున్నారు. భక్తులకు కనీస సమాచారం అందకుండా ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.
?తక్షణ చర్యలు చేపట్టాలి
?నిత్యం వేలాది మంది భక్తులతో రద్దీగా ఉండే అన్నవరం క్షేత్రంలో ఇలాంటి సాంకేతిక లోపాలు దేవస్థాన ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని స్థానికులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దేవస్థాన ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే చొరవ తీసుకుని, తొలి పావంచాల వద్ద మరియు ఇతర ప్రాంతాల్లో మూలపడిన డిస్ప్లే బోర్డులను పునరుద్ధరించాలని, భక్తుల వసతి ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# గాడిమోగలో రిలయన్స్ దోపిడి చేస్తున్న గ్యాస్ ప్రాంతాన్ని పరిశీలించిన వామపక్ష నేతలు

**కాకినాడ బ్యూరో ( గాడి మొగ) పెన్ పవర్, జూన్, 6:** చమురు, గ్యాస్ ధరలు పెరిగి, మార్కెట్‌లో కొరత ఎదుర్కొంటున్న నేపథ్యంలో 12వ ఫైనాన్స్ సిఫార్సు ప్రకారం కెజి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో రాష్ట్రానికి 50% వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 10 వామపక్ష పార్టీలు కెజిబేసిన్ గ్యాస్ ప్రాంతాన్ని గాడిమోగలో శనివారం పరిశీలించాయి

ఈ పర్యటనలో సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు, సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్, జిల్లా నాయకులు జేవీ సిపిఐ(యంఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు, సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రామకృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్, శేషుబాబ్జి తదితరులు ఉన్నారు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కృష్ణా గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువు రిలయన్స్ కంపెనీ ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌లకు తరలించి వేలకోట్ల రూపాయలు గాలివాటంగా సంపాదిస్తున్నది. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాల వలన నిత్య కాలుష్యమేకాక బ్లోఅవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలు, కోల్పోతున్నది. ఉత్పత్తుల్లో 50% రాష్ట్రానికివ్వాలని 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసినప్పటికీ అమలు కాలేదు. మరోవైపు రాష్ట్రంలో గ్యాస్ దొరకక సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు, హటల్ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక వ్యాపారాలు



మతపడి వందలాదిమంది ఉపాధి కోల్పోయి వీధుల్లో పడ్డారు. నిత్యావసరాలు, తినుబండారాల ధరలు పెరిగాయి. అందువలన కె.జి.బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో 50% రాష్ట్రానికివ్వాలి. చట్టబద్ధంగా రావాల్సిన చమురు, గ్యాస్ వాటా పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సీతానగరంలో సాగుకు సమాయత్తం



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 6:** మండలంలోని సీతానగరంలో శనివారం సాగుకు సమాయత్తం కార్యక్రమం జగ్గంపేట ఏడీఏ జి.శ్రీనివాస్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కౌలు చేసుకునే సందర్భంలో పంట రుణాలకు కౌలు కార్డులు ఉపయోగపడతాయన్నారు. రైతులంతా వీఆర్వో ద్వారా కౌలు కార్డులు పెట్టుకుని బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. రైతులంతా పంట పెట్టుబడికి బ్యాంకులో ఋణం దొరక్క బయట నుంచి తెచ్చుకోవడంతో పెట్టుబడి భారంగా ఉండడం వలన వ్యవసాయ శాఖ యజమాని అనుమతితో కౌలురైతులకు వీఆర్వోల ద్వారా కౌలు కార్డులు ఇప్పిస్తుందన్నారు. దీని ద్వారా రైతులకు పంట భీమా, బ్యాంకు రుణం, పంట నమోదు వంటి సౌకర్యాలు చేకూరతాయన్నారు. రైతులంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగ్గంపేట మండలంలో ఇప్పటి వరకు 365 కౌలు రైతు కార్డులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్ర మంలో మండల ఏఈఓ మౌళి, అసిస్టెంట్ పృద్వి, రైతులు పాల్గొన్నారు.

# మామిడిపళ్ళ అలంకరణ దాతలకు ఘన సత్కారం

## జనార్ధన స్వామి వారి చిత్రపటాన్ని అందించిన చైర్మన్.



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 06;**అధిక జ్యేష్ట మాసం శనివారం సందర్భంగా ఆలమూరు జనార్ధన స్వామి వారి ఆలయంలో మామిడిపండ్లతో స్వామివారిని అలంకరణ చేయించిన రావులపాలేనికి చెందిన కర్రి వీరారెడ్డి, నాగ శ్వేతా దంపతులను, వారి కుటుంబ సభ్యులను ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు దాతలకు స్వామివారి శేష వస్త్రాన్ని, మాలను అందించి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం చైర్మన్ బైరిశెట్టి రాంబాబు దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు హర్షితా రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రామారెడ్డి స్వాతి,శ్రీ వర్ణికారెడ్డి,వెంకటరెడ్డి, అనూరాధ,ఆనంద్ రాజ్ భూపాల్ రెడ్డి,సౌజన్య, శ్రీఆన్యారెడ్డి,రియాన్ష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తుట్టా జమీందారు కుటుంబానికి ముద్రగడ గిరిబాబు పరామర్శ.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 6:**ప్రత్తిపాడు మండలం వేములపాలెం గ్రామానికి చెందిన తుట్టా జమిందారు కుటుంబానికి ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు శనివారం పరామర్శించారు.వేములపా లెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కాకినాడ జిల్లా వైసిపి బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు తుట్టా జమీందారు సతీమణి అనంతలక్ష్మి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు.విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
శనివారం వేములపాలెంలోని జమీందారు నివాసానికి వెళ్లి శోకసంద్రంలో ఉన్న జమీందారుతోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.హఠాన్మరణం చెందిన అనంతలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కోలుకోలేని ఆవేదన నుండి కోలుకునేలా ఆ దేవుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.ఏ కష్టం వచ్చినా తుట్టా జమీందారు కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఏ అవసరమున్నా తాము ముందుంటామని ఈ సందర్భంగా గిరిబాబు భరోసా ఇచ్చారు.ఆయన వెంట స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని, అనంతలక్ష్మికి నివాళులర్పించారు.

# ప్రత్తిపాడు నియోజకవర్గంలో 70.65 శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 6:** ప్రత్తిపాడు నియోజకవర్గంలో 70.65% ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల నమోదు అధికారి, నియోజకవర్గ స్పెషల్ అధికారి ఏ శ్రీనివాసరావు అన్నారు. మండల కేందమైన ప్రత్తిపాడు తహాసిల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు లక్షల 19వేల 988 ఓటర్లకు గాను, 1లక్షా 55,వేల 419 మంది ఓటర్లను మ్యాపింగ్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఓటర్ల జాబితాలో ఓటు హక్కు కనిపించడంతోపాటు, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ద్వారా ఓటర్లకు ఓటు వేయడంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మండలాలు వారిగా తహసీల్దార్ లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ ల వివరాలను పోలింగ్ కేంద్రాలతో పక్కాగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలకమర్తి వెంకటరమణ, కాంగ్రెస్ నాయకుడు ధరణాలకోట శ్రీను, బిజెపి నాయకుడు సింగలిదేవి సత్తిరాజు, టిడిపి నాయకుడు కామేష్ తోపాటు ఆయా మండలాల తహసీల్దార్లు ఎం సూర్య ప్రభ, కీర్తి, నరేష్ పాల్గొన్నారు. అనంతరం బిఎల్ఓ లకు మ్యాపింగ్ ప్రక్రియ పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో బి ఎల్ ఓ లకు, సర్ సామాగ్రిని అందజేశారు.

# విదేశీ పర్యటన నుండి వచ్చిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 6:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అమెరికా పర్యటన పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా కాకినాడ జిల్లా ఎంపీపీ సమాఖ్య అధ్యక్షులు,ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి), రౌతులపూడి ఎంపీపీ గంటిమల్ల రాజ్యలక్ష్మి ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు,.విదేశీ పర్యటనను పూర్తి చేసుకొని వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం స్థానిక రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఏలేశ్వరం మండల వైస్ ఎంపీపీచ చిక్కాల రాజలక్ష్మి లక్ష్మణరావు,ఎంపిటిసి సభ్యులు కొప్పుల బాబ్జి,యిజనగిరి శివ ప్రసాద్,బుద్ధ ఈశ్వరరావు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు..

# "ఆపరేషన్ దండాయన"పై మహిళలకు అవగాహన

## సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో మహిళా పోలీసుల ప్రత్యేక కార్యక్రమం



**కాకినాడ, పెన్ పవర్,జూన్ 6:**మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర పోలీసు శాఖ చేపడుతున్న "ఆపరేషన్ దండాయన" కార్యక్రమంలో భాగంగా శనివారం కాకినాడ నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆదేశాలు, మహిళా మరియు శిశు భద్రత విభాగం ఐజీపీ బి. రాజకుమారి పర్యవేక్షణ, కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మహిళా ఎస్ఐ అనూష, శక్తి టీమ్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని సుమారు 150 మంది మహిళలు, యువతులు మరియు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళలపై జరిగే నేరాల నివారణ, మహిళల రక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు, "ఆపరేషన్ దండాయన" లక్ష్యాలు, మహిళలపై నేరాల విషయంలో అమలవుతున్న జీరో టాలరెన్స్ విధానం, వేగవంతమైన దర్యాప్తు, నిందితులకు త్వరితగతిన శిక్షలు పడే విధానాల గురించి వివరించారు.అదేవిధంగా మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న "శక్తి యాప్" వినియోగంపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసుల సహాయాన్ని తక్షణమే పొందే విధానాన్ని వివరించారు.మహిళలు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని, మహిళలపై ఎలాంటి వేధింపులు లేదా నేరాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# మందపల్లి మందేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ.. రూ.2.61 లక్షల ఆదాయం





**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 6:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శని ప్రభావ నివారణకు ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి తైలాభిషేకాలు, ఏకాదశ రుద్ర తైలాభిషేకాలు, మహాన్యాస పూర్వక తైలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.
ఆలయంలో కొలువై ఉన్న శ్రీ మందేశ్వర స్వామివారితో పాటు శ్రీ నాగేశ్వర స్వామి, శ్రీ బ్రహ్మేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. శనివారం కావడంతో శని దోష నివారణ, ఆయురారోగ్యాలు, ఐశ్వర్య ప్రాప్తి కోసం భక్తులు తిలదానాలు, స్వయం హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా శివనామ సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.
తైలాభిషేకాలు, వివిధ ఆర్జిత సేవలు, పరోక్ష పూజలు, ఫోన్ పే ద్వారా చెల్లింపులు, అన్నప్రసాద విరాళాల ద్వారా శనివారం ఒక్కరోజే దేవస్థానానికి మొత్తం రూ.2,61,829 ఆదాయం సమకూరినట్లు సహాయ కమిషనర్,కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.శని మహిమకు ప్రతీకగా నిలిచిన మందపల్లి క్షేత్రంలో ప్రతి శనివారం భక్తుల రద్దీ కొనసాగుతుండగా, ఈ శనివారం కూడా ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

## మందపల్లి మందేశ్వర స్వామి దేవస్థానంలో 15 రోజుల యోగా శిబిరాలు







**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 6:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక యోగా, ధ్యాన శిబిరాలను నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాలు జూన్ 7 నుంచి జూన్ 21 వరకు మొత్తం 15 రోజుల పాటు నిర్వహించబడతాయి. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో యోగా,మెడిటేషన్ కార్యక్రమాలు జరుగుతాయి. ఆధ్యాత్మికతతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. భక్తులు, యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని యోగా సాధన ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని, అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని దేవస్థానం సహాయ కమిషనర్,కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

## ఆమ్రఫలశోభిత ఆలమూరు శ్రీ జనార్ధన

* మామిడి పళ్ళ అలంకరణలో దర్శనమిచ్చిన వేదరక్షకునికి జన నీరాజనం



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 06;**పురుషోత్తమ మాసంగా ప్రసిద్ధి చెందిన అధిక జ్యేష్ట మాసంలో శనివారం నాడు ఆలమూరు శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామివారు మామిడి పళ్ళ అలంకరణలో అత్యంత శోభాయమానంగా దర్శనమిచ్చారు. మామిడిపళ్ళతో చేసిన అలంకరణలో స్వామివారి వైభవం దేదీప్యమానంగా ప్రకాశించింది. భక్తుల కోరికలన్నీ ఫలప్రదం చేసే జనార్ధనుడు ఆమ్రఫలాల మధ్య సకల ఫల ప్రదాయకునిగా దర్శనమివ్వడం విశేషం. స్వామివారికి అలంకరించిన మామిడిపళ్ళను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవానాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## సంచలన నాయకుడు వంగవీటి మోహన రంగా

చొప్పెళ్లలో వంగవీటి మోహన్ రంగా విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 06;**ఒకే ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన సంచలన నాయకుడు వంగవీటి మోహనరంగా అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. చొప్పెళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆయన తెదేపా అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. విజయవాడలో అన్ని కులాల వారు వంగవీటి మోహన్ రంగాను దేవుడిగా చూస్తారని, బడుగు బలహీన వర్గాలకు ఆయన ధైర్యాన్ని ఇచ్చారన్నారు. వంగవీటి మోహన రంగాతో ఎమ్మెల్యే బండారు తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బెజవాడ బెబ్బులిగా చిన్న చిన్న వర్గాల వారందరికీ అండగా రంగా ఉన్నారని కొనియాడారు. ఆయన జయంతి, వర్ధంతి నిర్వహించుకోవడమే కాకుండా, ఆయన విగ్రహాలు నెలకొల్పు కోవడం మాత్రమే కాకుండా, ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. చొప్పెళ్లలో కాపు కళ్యాణ మండపం మధ్యలోనే ఆగిపోయిందని, త్వరలోనే పూర్తి చేసుకుందామన్నారు. కాపు యువత ఐక్యంగా ఉండడంతో పాటు, అందరిని కలుపుకుని ముందుకు వెళ్లాలన్నారు. అందరికీ అండగా నిలబడాలని సూచించారు.

# మాతృ, శిశు మరణాల నివారణకు శాఖల సమన్వయం అవసరం

### కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**కాకినాడ, పెన్ పవర్,జూన్ 6:**జిల్లాలో మాతృ, శిశు మరణాలను పూర్తిగా నివారించేందుకు వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహానాయక్, వివిధ విభాగాల కార్యక్రమ నిర్వహణ అధికారులు,కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి వైద్య నిపుణులతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి మాతృ, శిశు మరణాల సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జనవరి, ఫిబ్రవరి,మార్చి నెలల నాల్గవ త్రైమాసికంలో జిల్లాలో ఒక్క మాతృ మరణం కూడా నమోదు కాకపోవడం సంతోషకర విషయమన్నారు. అయితే గత ఆర్థిక సంవత్సరంలో తొలి మూడు త్రైమాసికాల్లో నమోదైన 11 మాతృ మరణాల కారణాలను సమీక్షించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

గర్భధారణ దశ నుంచే గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు ప్రమాదకర లక్షణాలు,కాన్పు ప్రణాళిక,అత్యవసర పరిస్థితుల్లో ఉన్నత ఆసుపత్రులకు తరలింపు విధానం,సురక్షిత ప్రసవంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు,జిల్లా ఆసుపత్రుల మధ్య సమన్వయం పెంపొందించి సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా అధిక ప్రమాద ముప్పు ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అలాగే గత జనవరి, ఫిబ్రవరి,మార్చి నెలల్లో జిల్లాలో 44 శిశు మరణాలు నమోదైనట్లు పేర్కొంటూ, వాటి కారణాలను విశ్లేషించి నివారణ చర్యలను మరింత పటిష్టం చేయాలని వైద్య అధికారులకు సూచించారు. ముఖ్యంగా మల్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కాకినాడ సీతారామనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,పెద్దాపురం శంకరయ్యపేట పరిధిలో నమోదైన మూడు శిశు మరణాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయి లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. భవిష్యత్తులో శిశు మరణాలను సున్నాకు తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మాతా–శిశు సంరక్షణ లక్ష్యాలను అన్ని శాఖల సమన్వయంతో నూటికి నూరు శాతం సాధించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కాకినాడ జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డా.పి. కోమల, ఇన్‌చార్జ్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.మహేశ్వర రావు,జిల్లా క్షయ నివారణ అధికారి డా. చలమయ్య, ఎన్టీఆర్ వైద్య సేవల సమన్వయకర్త డా.రాధాకృష్ణ,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. కె.వి. సుబ్బరాజు, స్త్రీ ప్రసూతి,శిశు వైద్య విభాగాల అధిపతులు,సహ ఆచార్యులు,పెద్దాపురం విభాగాధికారి డా. ఎన్.ప్రశాంతి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు,క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆవు దాడిలో గాయపడిన చింతల రాంబాబుకు తుమ్మలపల్లి రమేష్ పరామర్శ.



**కిర్లంపూడి,పెన్ పవర్,జూన్ 06:**ఆవు దాడిలో గాయపడిన చింతల రాంబాబుకు జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ శనివారం పరామర్శించారు. కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన చింతల రాంబాబును ఇటీవల ఆవు పొడవడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం కాకినాడలోని ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న తుమ్మలపల్లి రమేష్ శనివారం ఆసుపత్రికి వెళ్లి రాంబాబును పరామర్శించారు. ఈ సందర్భంగా రాంబాబు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడమే కాకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు,చింతల ప్రసాద్, కాయల మణికంఠ, పాలెం బాబీ, గోకేడ పండు స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన సార్వ సాగు పనులు



**తాళ్ళపూడి, పెన్ పవర్, జూన్ 6:**తాళ్లపూడి మండలంలో సార్వా సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వర్షాలు కురవడంతో ఎండిన చేలల్లో కొద్దిగా నీరు చేరింది. దీంతో ముందస్తు చర్యలుగా దుక్కులు దున్నే పని ప్రారంభించారు. ప్రతీ ఏటా దాళ్వా సాగు ముందుగా ముగియడంతో పనులు ప్రారంబించేందుకు రైతులకు వెసులుబాటు కలిగేది. అయితే గత దాళ్వా సాగు అలస్యంగా ప్రారంభం కావడం, ముందుగా నాట్లు వేసిన చేలల్లో పంట చేతికి వచ్చింది. ఆలస్యంగా ఊడ్చిన చేలు ఇటీవలే కోతలు కోయడం వాతావరణ మార్పులతో వర్షాలు పడటంతో పంట చేతికి రావడం ఆలస్యమైంది. దీంతో సార్వా సాగు ఆలస్యంగా ప్రారంభిందామనుకున్న రైతులకు వరుణుడు కరుణించడంతో సాగు పనులు ప్రారంబించారు. మండలంలో గత సార్వాలో 11 వేల ఎకరాల్లో సార్వా సాగు చేశారు. ఇదే అంచనాతో ఈసార్వా సాగుకూడా కొనసాగిస్తారని అధికారులు అంచనాకు వచ్చినట్టు, అందుకు అనుగుణంగా విత్తనాలు సిద్దం చేశామని మండల వ్యవసాయాధికారిణి రుచిత తెలిపారు. రాబోయే రోజుల్లో వాతావరణ మార్పుల ప్రభావం లేకుండా 150 రోజుల్లో పంట చేతికి వచ్చే పి.ఎల్.ఏ 1100, ఎంటియు 1318, 7029 సంపత్ స్వర్ణ విత్తనాలను సిద్ధం చేశామని ఆమె తెలిపారు.

## భూమి సామర్థ్యాన్ని బట్టి పంటలు వేసుకోవాలి మండల ఏ ఓ రాజరాజేశ్వరి






**గోకవరం పెన్ పవర్ జూన్ 06:--** మన గోకవరం మండలంలో మెట్ట ప్రాంతం అత్యధికంగా ఉన్నందున ఆ ప్రాంతాలలో ఉన్న భూమి సామర్థ్యాన్ని బట్టి ఆయా రకాల వరి వేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గోకవరం మండల వ్యవసాయ అధికారిని రాజరాజేశ్వరి రైతులకు సూచించారు. దీనికి సంబంధించి శనివారం ఆమె మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ 2026 లో రైతులు వేసే వరి గోకవరం మెట్ట ప్రాంత సాగులోకి వస్తుంది కాబట్టి నీటి వసతి ఉన్న గ్రామాల్లో జూన్ 4 వ వారం లోపు ఎమ్ టి యు ( మారుటేరు) 1318, స్వర్ణ (7029) వంటి రకాలు విత్తుకోవాలి. జూలై 2 వ వారంలో విత్తుకునే రైతులు ఎమ్ టి యు( మారుటెరు )1318, స్వర్ణ (7029), బి పి టి 5204 వంటి రకాలు వెదజల్లే పద్ధతిలో విత్తు కొన్నట్లు అయితే పంట నారుమడి లో పెరిగే సమయం తగ్గి త్వరగా కోతకు వస్తుంది. లేట్ గా విత్తుకోవాలి అనుకునే రైతులు స్వల్ప కాలిక రకాలు అయ్యిన ఎమ్ టి యు( మారుటెరు ) 1121 , 1293, 1290 వంటి రకాలు విత్తుకోవాలి. మండలం లో సొసైటీ లలో ప్రైవేట్ దుకాణాలు లో విత్తనాలు అందుబాటులో ఉన్నవి. రైతులు మొలక శాతం చూసుకుని సాగుకు అనుకూలంగా ఉన్న రకాలను మాత్రమే సాగు చేసు కోవాలి. సివిల్ సప్లయ్ శాఖ వారి ఆదేశాల ప్రకారం పి ఆర్ సంపద స్వర్ణ , సాధన మొదలగు విత్తనాలు సాగు చేస్తే ధాన్యం కొనుగోలు జరుగదని సిఫార్సు చేసిన వరి రకాలను మాత్రమే సాగుచేసుకోవాలి. రైతులు విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. ఎల్నినో ప్రభావం తప్పించు కోవడానికి వెదజల్లే పద్ధతి పాటించాలి. నీటి వసతి లేని వారు వర్షాధార పంటలు అయ్యిన అపరాలు సాగుకు వెళ్లాలి అని మండల రైతులు వ్యవసాయ సలహా అధికారులు సూచనలు పాటించి లాభసాటి వ్యవసాయాలు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని రాజరాజేశ్వరి రైతులను విజ్ఞప్తి చేశారు.